సాక్షి
వికారాబాద్

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



ఊరు వెళ్తున్నారా..

దసరా పండుగ సెలవుల నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లేవారు తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. 10లో▸



కాకా సేవలు చిరస్మరణీయం

స్వర్గీయ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గడ్డం వెంకటస్వామి జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. 10లో▸



దుర్గామాత ఉత్సవాలు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలల్లో, ఆయా దేవాలయాల్లో దుర్గామాత ఉత్సవాలు కొనసాగుతున్నాయి. 11లో▸



హంస వాహనంపై శ్రీవారు

వికారాబాద్ పట్టణంలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు శనివారం రాత్రి హంస వాహనంపై విహరించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

ముత్యాలపందిరి వాహనంపై అనంతుడు

వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో వెలసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు ముత్యాలపందిరి వాహనంపై కొలువుదీరి ఆలయ మాఢ వీధుల్లో విహరించారు.





బతుకమ్మ సంబురం

వికారాబాద్ మండలం మదన్‌పల్లిలో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. వాటిని ఒక్క చోట చేర్చి ఆటాపాటలతో సందడి చేశారు.

– అనంతగిరి

న్యూస్‌రీల్

భాస్కరయోగికి సాహితీ పురస్కారం



తనికెళ్ల భరణి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న భాస్కరయోగి

పరిగి: తెలంగాణ సారస్వతి పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మనిధి సాహితీ పురస్కారాన్ని పరిగి పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త, వక్త భాస్కరయోగి శుక్రవారం అందుకున్నారు. నగరంలోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సినీ నటుడు, సాహితీ వేత్త తనికెళ్ల భరణి, తెలంగాణ సారస్వతి పరిషత్తు అధ్యక్షుడు ఎలూరి శివారెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్



అధికారులతో మాట్లాడుతున్న మాణిక్‌రాజ్

కొడంగల్: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్ సూచించారు. శనివారం ఆయన కొడంగల్‌లో పర్యటించారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్‌జైన్, సిక్తా పట్నాయక్ తోపాటు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5 వేల కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. మెడికల్ కళాశాల, టీచింగ్ ఆస్పత్రి, నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం, చెరువుల విస్తరణ, అభివృద్ధి పనులు, ఇంటిగ్రేటెడ్ గురుకులాలు, కొండారెడ్డిపల్లి గ్రామానికి సౌర విద్యుత్, జూనియర్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. అలాగే నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించాలన్నారు. భవిష్యత్ అభివృద్ధి పనుల కోసం భూమి అవసరం ఉందన్నారు. సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, వికారాబాద్, నారాయణపేట జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ



తాండూరులోని భావిగి భద్రేశ్వర స్వామి దేవస్థానం

తాండూరు టౌన్: పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి దేవస్థాన (గుడి) పునరుద్ధరణ కమిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర దేవాదాయ శాఖ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలోని 15 ఆలయాలకు సంబంధించిన పునరుద్ధరణ కమిటీ ఏర్పాటు కోసం దేవాదాయ శాఖ చట్టం 1987 ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేశారు. కమిటీ ఏర్పాటు కోసం ఫారం 11 ద్వారా ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో కమిటీ కాల పరిమితి ఆరునెలలు ఉండగా ఈ సారి ఏడాది పాటు కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



అద్దె భవనంలో కొనసాగుతున్న పరిగి గురుకుల పాఠశాల

అరకొర వసతులు!

అద్దె భవనాలు.. ఇరుకు గదుల్లో గురుకులాలు

- జిల్లాలో మొత్తం ఆశ్రమ పాఠశాలలు 24
- పాతవి మినహా కొత్తవన్నీ అద్దె భవనాల్లోనే..
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- స్థలాల పరిశీలనతో సరిపెడుతున్న అధికారులు పట్టించుకోని పాలకులు

వికారాబాద్: గురుకులాలకు గూడు కరువై విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. గత ప్రభుత్వం ఏడేళ్ల క్రితం ఆర్భాటంగా ఆశ్రమ పాఠశాలలను మంజూరు చేసి వాటికి సొంత భవనాలు సమకూర్చడంలో విఫలమైంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. జిల్లాలో కొత్తగా మంజూరైన గురుకులాల నిర్వహణను గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం కారణంగా కొన్ని ఆశ్రమ పాఠశాలలు పక్క జిల్లాకు తరలివెళ్లాయి. మరికొన్ని అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాలు నిర్మించి అన్నింటిని ఒకే గొడుగు కిందకు తెస్తామని ప్రకటించారు. అయితే సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో మాత్రమే స్థల ఎంపిక చేశారు. త్వరలో భవన నిర్మాణం ప్రారంభించనున్నారు. మిగతా నియోజకవర్గాల్లో ఈ ఊసే లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రజా ప్రతినిధుల వైఫల్యం

జిల్లాలోని ఎమ్మెల్యేలకు గురుకులాల గోడు పట్టడం లేదు. కొత్తగా మంజూరైన ఆశ్రమ పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడం.. అద్దె భవనాలు సమకూర్చడంలో అధికారులు, పాలకులు విఫలం కావడంతో కొన్నింటిని పక్క జిల్లాలో నిర్వహిస్తున్నారు. జిల్లాకు చెందిన నాలుగు గురుకులాలను పక్క జిల్లా రంగారెడ్డిలో కొనసాగిస్తున్నారు. ఇటీవల రెండింటిని మళ్లీ జిల్లాకు తీసుకువచ్చారు. మరో రెండు అక్కడే ఉండిపోయాయి. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలను అద్దె భవనాలు.. ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. ఆట స్థలాలు కూడా లేకపోవంతో విద్యార్థులకు ఆటా పాటాకు దూరమవుతున్నారు. తల్లిదండ్రులు వచ్చినప్పుడు వారి పిల్లలతో మాట్లాడేందుకు చోటు కూడా లేదు. దీంతో చేసేది లేక గేటు బయట నుంచే మాట్లాడి తెచ్చిన వస్తువులు ఇచ్చి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏడేళ్లు దాటినా..

ఉమ్మడి రాష్ట్రంలో నియోజకవర్గానికి రెండు చొప్పున గురుకుల పాఠశాలలు ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం కొలువు దీరాక ఒక్కో నియోజకవర్గానికి నాలుగు చొప్పున గురుకులాలను మంజూరు చేసింది. దీంతో జిల్లాలో వీటి సంఖ్య 24కు చేరింది. గతంలోని ఆశ్రమ పాఠశాలలకు సొంత భవనాలు ఉండగా కొత్తగా మంజూరైన వాటిని అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. గురుకులాలు ప్రారంభమై ఏడేళ్లు దాటినా సొంత భవనాలకు నోచుకోలేదు. ప్రైవేటు వ్యక్తులు అద్దె కోసమే ఏకంగా భవనాలు నిర్మించి గురుకులాల కోసం ఇస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆశ్రమ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాల్సి ఉంది.



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

రాష్ట్రంలో నూతన విద్యా విధానం

- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు
- రాష్ట్ర ఐటీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు

చేవెళ్ల: రాష్ట్రంలో నూతన విద్యా విధానం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని, దీనిపై సబ్ కమిటీ వేసి అధ్యయనం చేస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని అన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం అంటే సమాజాన్ని గౌరవించినట్లే అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పటిష్టత కోసం ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని అయినా ఎందుకు ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి అనే అంశంపై ఉపాధ్యాయులు ఆలోచన చేయాలన్నారు. 317 జీఓతో ఇబ్బంది పడిన ఉపాధ్యాయులకు పండుగలోపే ఓ మంచి నిర్ణయం రాబోతోందన్నారు. శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు భావితరాలకు బాటలు వేస్తారన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులు రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యు.పోచయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బదిలీ నెల (జూలై) వేతనం ఇప్పించాలని కోరారు. హెచ్‌ఆర్‌ఏ స్థాయిని చేవెళ్ల నియోజకవర్గం వరకు పెంచే విధంగా చూడాలని మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే కాలె యాదయ్య విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శైలజ, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గం నాయకులు పామెన భీంభరత్, వసంతం, దర్శన్, మధుసూదన్ రెడ్డి, గౌరీ సతీష్, వీరేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో పార్ట్‌టైం ఉద్యోగాలు

అనంతగిరి: జిల్లాలోని గిరిజన గురుకుల విద్యాలయాల్లో పార్ట్‌టైం అధ్యాపకుల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా గిరిజన గురుకుల విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల్కచర్ల కళాశాలలో బొటనీ, జువాలజీ, టీజీటీ మ్యాథ్స్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. కొడంగల్‌లో పీజీటీ మ్యాథ్స్, బయోసైన్స్, సోషల్ పోస్టులు, తాండూరులో జువాలజీ, పీజీటీ మ్యాథ్స్, టీజీటీ ఇంగ్లిష్, సోషల్, పీడీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న రాజేంద్రనగర్‌లోని మానస హిల్స్ టీజీటీడబ్ల్యూఆర్ ఐటీ సర్కిల్ సెంటర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన



వికారాబాద్ డైట్ కళాశాలలో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతగిరి: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. ఎస్‌జీటీ, ఎస్‌ఏ, పండిట్, పీఈటీ పోస్టులకు కలిపి 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్లను పరిశీలించారు. 923 మంది అభ్యర్థులకు గాను 830మంది హాజరైనట్లు డీఈఓ రేణుకాదేవి తెలిపారు.

భూములు లాక్కుంటే ఊరుకోం

- అన్నం పెట్టే రైతులతో మందు గోలీలు మింగిస్తారా?
- పంట భూముల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు సరికాదు
- ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్వాగతిస్తాం
- ఫార్మా భూ బాధితుల ధర్నాలో ఎంపీ డీకే అరుణ
- సీఎంకు లేఖ రాస్తానని వెల్లడి

దుద్యాల్: ఫార్మా కంపెనీ పేరిట రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకోమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్న రైతుల భూముల్లో విషపూరితమైన ఫార్మా కంపెనీ ఏర్పాటు చేసి అన్నం పెట్టే అన్నదాతలతో మందు గోలీలు మింగిస్తారా..? అని నిలదీశారు. శనివారం దుద్యాల్ మండలం హకీంపేట్ ప్రధాన కూడలిలో ఫార్మా భూ బాధిత రైతులు నిర్వహిస్తున్న ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ మండలం కూడా కొడంగల్ నియోజకవర్గంలోనే ఉందని, ఇక్కడి ప్రజలు కూడా మీకు ఓట్లు వేశారని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. విషపూరితమైన కంపెనీలు తెచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాలని చూస్తే ఊరుకోమని.. తెగించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. భూములు కోల్పోతే రైతులు తిరిగి కొనే పరిస్థితి లేదన్నారు. బలవంతపు భూ సేకరణను విరమించుకోవాలని, ఫార్మా కంపెనీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని తెలిపారు. ఫార్మా కాకుండా ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామన్నారు. అనంతరం మండలంలోని పోలేపల్లి రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హైడ్రాపై ఆగ్రహం

నగరంలో హైడ్రా కూల్చివేతలపై ఎంపీ డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూల్చి వేస్తున్న ఇళ్లకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుమతులు ఇచ్చిందనే విషయం మరిచిపోయారని మండిపడ్డారు. కొడంగల్‌లో ముఖ్యమంత్రి ఉన్న ఇల్లు కూడా చెరువులోనే ఉందనే వార్తలు వస్తున్నాయని.. మొదట ఆ ఇల్లు కూలగొట్టాలి కదా అని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చి వారిని రోడ్డుపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వంపై కూడా ఏడాది లోపు ఇంత వ్యతిరేకత రాలేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని పాలించే సత్తా లేక పేదలను బాధపెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పున్నంచంద్ లాహోటి, ప్రతాప్‌రెడ్డి, మండల నాయకుడు శ్రీకాంత్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సురేశ్, హకీంపేట్ మాజీ సర్పంచ్ యాదయ్య, బీజేపీ నాయకులు, రైతులు శివకుమార్, కృష్ణయ్య, బాలరాం, మణికంఠ గౌడ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మద్దతుగా ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

రైతులు అధికారుల సూచనలు పాటించాలి

రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

కడ్తాల్: రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని కర్కల్ పహాడ్ గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. వర్షకాలం 2024 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ విస్తరణ అధికారులు చేపట్టిన పంటల నమోదు కార్యక్రమంలో భాగంగా, నమోదు చేసిన పంటలను పరిశీలించారు. అధిక వర్షాలకు పంటల్లో వచ్చే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 1,28,870 ఎకరాల్లో వరిపంట సాగు చేయడం జరిగిందని, అందులో 2,96,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. సన్న రకాలు 78శాతం, దొడ్డు రకాలు 22 శాతం దిగుబడి రావొచ్చని పేర్కొన్నారు. ధాన్యాన్ని వరి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, క్వింటాలు గ్రేడ్ –ఏ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ధర నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వం సన్న చిన్న కారు రైతులకు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి తేమ 17 శాతం ఉండేట్లు చూసుకోవాలని, నాణ్యతా ప్రామాణాలు పాటిస్తూ, ధాన్యంలో రాళ్లు, తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారులు రమేష్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్: కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని పాతకొడంగల్‌లో గిరిజన గురుకుల పాఠశాలలో పీజీటీ గణితం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని చెప్పారు. గణితం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రంలో పీజీ, బీఎడ్ అర్హత ఉన్నవారు ఈ నెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని, 21న ప్రధాన కార్యాలయం మానస హిల్స్, రాజేంద్రనగర్‌లో నిర్వహించే డెమోకు హాజరవ్వాలన్నారు. వివరాలను 9441917170 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నీటి సహాయకులకు రేపటి నుంచి శిక్షణ

బంట్వారం: గ్రామ నీటి సహాయకులకు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతులు ఉంటాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుమాధవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించి నీటి సహాయకులకు శిక్షణా తరగతులుంటాయన్నారు. నీటి సరఫరాకు సంబంధించి పలు అంశాలపై ట్రైనర్లు శిక్షణ ఇస్తారన్నారు. విధిగా నీటి సహాయకులు హాజరుకావాలన్నారు.

ఏవైసీ అధ్యక్షుడికి సన్మానం


ఉదయ్‌భాను చిబ్‌ను సన్మానిస్తున్న కృష్ణంరాజు

కొడంగల్: ఇటీవల అఖిల భారత యువజన కాంగ్రెస్(ఏవైసీ) జాతీయ అధ్యక్షుడిగా నియమితులైన ఉదయ్‌భాను చిబ్‌ను పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ కృష్ణంరాజు శనివారం ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సన్మానించారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక అయినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి


సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు మేలు చేకూరుతోందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని కరన్‌కోట గ్రామానికి చెందిన వెంకటేశ్‌కు రూ.2లక్షలు, పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామానికి చెందిన మజాబీన్ బేగంకు రూ.లక్ష ఎల్‌ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

టమాటా @రూ.వంద

ధారూరు: కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి. టమాటా ధర అమాతం పెరిగింది. ధారూరులో సంతలో గతవారం కిలో రూ.40 ఉండగా ఈ శనివారం రూ.వంద చొప్పున విక్రయించారు. అల్లం, వెల్లుల్లి గత వారం రూ.180 ఉండగా రూ.220 వెచ్చించారు. మిగిలిన కూరగాయలు రూ.60 నుంచి రూ.80 వరకు పలికాయి. ఉల్లిగడ్డ ధర సైతం భారీగా పెరిగింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఊరు వెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త!

- తాళం వేసి వెళ్లేవారు ఠాణాలో సమాచారం ఇవ్వండి
- దొంగతనాల నివారణకు పోలీసుల సూచనలు



షాద్‌నగర్: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ఎక్కువగా బంధువుల ఇళ్లు, స్వగ్రామాలకు, విహార యాత్రలకు వెళ్తుంటారు. వీళ్ల ఇళ్లనే టార్గెట్ చేసుకుని అక్రమార్కులు రెచ్చిపోతుంటారు. అందినకాడికి దండుకుని పరారవుతుంటారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

అంతర్రాష్ట్ర దొంగలు, ఇతర జిల్లాలకు చెందిన వారు అనువైన ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు. ఎక్కువగా శివారు కాలనీలు, తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెక్కీ నిర్వహించి రాత్రి వేళ దోపిడీలకు పాల్పడుతుంటారు.

పోలీసుల సూచనలు

- సెలవులకు ఊరు వెళ్లేవారు కుటుంబ సభ్యుల్లో ఒకరు ఇంట్లో ఉండేలా చూసుకోవాలి.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలి.
- ఊర్లో ముందు ఇంటి ఆవరణలో లైట్లు వేసి ఉంచాలి. డోర్‌కు తాళం వేసి కర్టెన్ వేయాలి.
- సోషల్ మీడియాలో మీరు ఊర్లో విషయం పోస్టు చేయడం మంచిది కాదు.
- నమ్మకమైన వ్యక్తిని వాచ్‌మెన్‌గా పెట్టుకోవాలి.
- బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఉంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- ఇంటికి తాళం వేసి వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.
- సెంట్రల్ లాకింగ్ సిస్టం తాళాలు అమర్చుకోవడం మంచిది.
- ఇంటి ఎదుట చెత్త, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమకాకుండా చూసుకోవాలి.
- ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉన్న తాళాలను అమర్చుకోవాలి
- పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించండి చెప్పడం మర్చిపోవద్దు.
- వాహనాలకు తాళం వేయాలి. ద్విచక్రవాహనాలకు చైన్‌తో కూడిన లాక్ వేయడం మంచిది.

దుకాణాదారులు అప్రమత్తంగా ఉండాలి

పండుగ సందర్భంగా కొత్త దుస్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేస్తుంటారు. దీంతో దుకాణాలు రద్దీగా ఉంటాయి. ఇటీవల దొంగలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి దుకాణాల్లో చోరీలు చేస్తున్నారు. సెల్‌ఫోన్లు, నగదు దోచుకెళ్తున్నారు. దుకాణ దారులు రాత్రి వేళ నగదు, విలువైన ప్రతాలు కౌంటర్లలో పెట్టకుండా వెంట తీసుకెళ్లడం శ్రేయస్కరం. నగదును బ్యాంకుల్లో జమ చేసుకోవడం ఉత్తమం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

నగలు, నగదు ఇంట్లో ఉంచొద్దు



ప్రతీ ఇంట్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. విలువైన ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచుకోవద్దు. బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. లేదంటే 100 డయల్ చేయాలి.

– విజయ్‌కుమార్, సీఐ షాద్‌నగర్ టౌన్


చిన్నారులను అభినందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- హంస వాహనంపై ఊరేగిన వేంకటేశ్వర స్వామి వారు
- ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారు హంస వాహనంపై ఊరేగారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

అలరించిన నృత్యాలు

ఉత్సవాల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో శుక్రవారం రాత్రి చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం వారికి ఆలయ కమిటీ సభ్యులు జ్ఞాపికలు అందజేశారు.


చిన్నారుల నృత్యప్రదర్శన


కలెక్టరేట్‌లో కాకా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

కాకా సేవలు చిరస్మరణీయం

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: దివంగత మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతిని శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రిగా, ఎమ్మెల్సీగా గడ్డం వెంకటస్వామి పేదలు.. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోతారని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లేశం, డీపీఆర్‌ఓ చెన్నమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోజెస్, ఏఓ పర్వీన్ ఖాతూన్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

ఎస్పీ కార్యాలయంలో కాకా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్‌ఐ డేవిడ్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

మస్టర్లు లేకుండానే ఆడిట్

- అక్రమాలు చోటుచేసుకున్నా పట్టించుకోరా..?
- సామాజిక తనిఖీల్లో అధికారులను నిలదీసిన ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు

ధారూరు: ఉపాధిహామీ పనులపై నిర్వహించే సామాజిక తనిఖీలో చేసిన పనులకు ఎంబీలు, మస్టర్లు తప్పనిసరి. కానీ శనివారం ధారూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ఇందుకు భిన్నంగా సాగింది. డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఏపీడీ సరళ నిర్వహించిన ఈ తనిఖీలో 25శాతం పనులకు రికార్డులు లేకుండానే అధికారులు తనిఖీలు చేపట్టి మమ అనిపించారు. దీనిపై ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో చేపట్టిన పనులకు మించి పేమెంట్ ఉండడం, రికార్డులు లేకుండానే పేమెంట్ అయినట్లు చూపడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అవకతవకలకు పాల్పడిన ఎఫ్‌ఏలకు పెనాల్టీ విధించి వదిలేయడంపై అధికారులను నిలదీశారు. దోర్నాల్ తండాలో రూ.3.97లక్షల చెల్లింపులు జరిగాయని.. ఇందుకు అసలు తాము పనులే చేయలేదని చెప్పారని తనిఖీ బృందం సభ్యుడు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.


విద్యుత్ సరఫరా నిలిచిపోయినా చీకట్లోనే తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కూలీలు చేసిన పనుల కొలతలు సైతం తేడాలున్నాయని తనిఖీ బృందం అధికారులకు చెప్పారు.

నాగసమందర్‌లో భారీగా అక్రమాలు

నాగసమందర్ పంచాయతీ పనిలో చేపట్టిన ఉపాధి పనుల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకోవడంపై ప్రజలు అధికారులను నిలదీస్తూ ఆందోళన చేపట్టారు. ఎంపీడీఓ పోలీసులకు రప్పించేందుకు సిద్ధమవ్వగా పీడీ నివారించారు. ఏఏ పనుల్లో అక్రమాలు జరిగాయి, బాధ్యులెవరు? ఇతర గ్రామాల నుంచి వచ్చిన కూలీలతో ఎందుకు పనులు చేయించారు, 1200 కూలీలున్న నాగసమందర్ కూలీలకు ఎందుకు పనులు చూపలేదు? చేయని పనులకు బిల్లులు ఎలా ఇచ్చారు? ఎంబీ రికార్డులు ఎందుకు తీసుకురాలేదు తదితర ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పకుండా దాటవేశారు. అంబుడ్స్‌మెన్ ద్వారా నెల రోజుల్లో మీ అందరి సమక్షంలో విచారణ జరిపిస్తామని పీడీ శ్రీనివాస్ హామీ ఇవ్వడంతో వారంతా శాంతించి వెళ్లిపోయారు. కాగా ప్రజలు అధికారులను నిలదీస్తూ ఆందోళన చేస్తున్న సమయంలోనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అధికారులే కావాలని విద్యుత్ సరఫరా నిలిపివేయించారని ప్రజలు ఆరోపించారు. ఈ సామాజిక తనిఖీలో ఎంపీడీఓ నర్సింహులు, ఏపీఓ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తరకం జొన్నసాగుతో అధిక దిగుబడి

తాండూరు వ్యవసాయ పరిశోధన సేద్య విభాగం శాస్త్రవేత్త శేఖర్

దౌల్తాబాద్: కొత్తరకం జొన్న సాగుతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చునని తాండూరు వ్యవసాయ పరిశోధన సేద్య విభాగం శాస్త్రవేత్త శేఖర్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని బిచ్చాలలో రైతులకు యాసంగి ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు పరిశోధన స్థానంలో కొత్తరకం జొన్న జొన్న–55 మలదండి అందుబాటులో ఉందని.. ఈ రకం అధిక దిగుబడి వస్తుందన్నారు. అనంతరం రైతులకు కంది, పత్తిలో ఎదురయ్యే సమస్యలను సమగ్ర నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో నిర్వహణ సభ్యులు బుగ్గప్ప, అనిల్, సంజీవ్, ప్రకాష్, సిబ్బంది తదితరులున్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

నిషేధిత వస్తువులు అమ్మితే చర్యలు

సీఐ నవీన్‌కుమార్



మోమిన్‌పేట: నిషేధిత వస్తువులు అమ్మితే చర్యలు తప్పవని సీఐ నవీన్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గుట్కా, పాన్‌మసాలా, గంజాయి తదితర మత్తు పదార్థాలు అమ్మినా.. కొనుగోలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. మోమిన్‌పేట, నవాబ్‌పేట, మర్పల్లి మండలాల పరిధిలో పేకాట, మట్కా ఆడుతున్నట్లు సమాచారం అందుతోందని అలాంటి వారిపై కేసులు చేసి జైలుకు పంపుతామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ చూపాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. దసరా పండుగకు ఇంటికి తాళం వేసి వెళ్తున్న ప్రజలు పక్కింటి వారితో పాటుగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ ఎవరికీ చెప్పకూడదన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

ఆమనగల్లు: పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శనివారం వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు వేలం వేశారు. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఉజ్వలారెడ్డి, డిప్యూటీ కమిషనర్ దశరథ్ సమక్షంలో ఆమనగల్లు సీఐ బద్యానాద్ చౌహాన్ ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు. ప్రభుత్వ ధర రూ.24 వేలు నిర్ణయించగా వేలంలో రూ.45 వేలు పలికింది. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలలో ఇటీవల మొత్తం 73 కేసులు కాగా ఇందులో 128 లీటర్ల నాటుసారా, 5.86 లీటర్ల మద్యం, 4.55 లీటర్ల బీర్లు పట్టుబడ్డాయి. ఈ మద్యాన్ని డీపీఈఓ ఉజ్వలారెడ్డి సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎక్సైజ్ ఎస్‌ఐలు కృష్ణప్రసాద్, అరుణ్‌కుమార్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడిని చంపించిన నిందితురాలికి రిమాండ్

ధారూరు: ప్రియుడిని హత్య చేయించి, తప్పించుకు తిరుగుతున్న మహిళను శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ధారూరు సీఐ భీంకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కోట్‌పల్లి మండలం అన్నాసాగర్‌కు చెందిన ఓ వివాహితకు.. ఇదే గ్రామానికి చెందిన శ్రీకాంత్(27), చౌట మల్లేశం అనే ఇరువురితో వివాహేతర సంబంధం ఉంది. మొదట తనతో ఉన్న ఆమె ఆతర్వాత మల్లేశంకు దగ్గరైందని తెలుసుకున్న శ్రీకాంత్ ఇరువురినీ చంపేస్తానని ప్రియురాలిని బెదిరించాడు. దీంతో ఇతని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న ఆమె పథకం ప్రకారం మల్లేశం, అతని మిత్రులతో సెప్టెంబర్ 25న శ్రీకాంత్‌ను హత్య చేయించింది. ఈ కేసులో శుక్రవారం నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇది తెలుసుకున్న సదరు మహిళ తప్పించుకుంది. తన తల్లి గారి గ్రామమైన చేవెళ్ల మండలం కౌకుంట్లలో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఆమెను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో కోట్‌పల్లి ఎస్‌ఐ ప్రవంతి పాల్గొన్నారు.


నిందితురాలిని అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీంకుమార్, ఎస్‌ఐ ప్రవంతి

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు, విలువైన డాక్యుమెంట్లు అగ్నికి ఆహుతి


కాలిబూడిదైన ఇల్లు


మంటల్లో కాలిన డాక్యుమెంట్లు

మొయినాబాద్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైంది. ఇంట్లోని వస్తువులతో పాటుగా బంగారం, నగదు, విలువైన పత్రాలు కాలిబూడిదయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని మేడిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి యాదయ్యకు బండల ఇల్లుంది. కుటుంబ సభ్యులు ఉదయం ఇంట్లో దేవుడికి దీపం పెట్టి తాళం వేసి పనికి వెళ్లారు. ఉదయం 10.20గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఇంటి నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్‌తో వచ్చిన సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే బీరువాలోని నాలుగున్నర తులాల బంగారు ఆభవరణాలు, రూ.40వేల నగదు, ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, బియ్యం తదితర వస్తువులు కాలిబూడిదయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకుని వచ్చిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. యాదయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు నాయకులు, గ్రామస్తులు కోరారు.

అమరుల ఆశయసాధనకు కృషి

టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్

పరిగి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడి మరణించిన కార్మికుల త్యాగాలు మరువలేనివని టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్‌డిపో ఎదుట అమరులైన కార్మికులకు నివాళి అర్పించారు. అనతరం హన్మంత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. 2019 అక్టోబర్ 5 నుంచి 55 రోజుల పాటు ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్వహించారన్నారు. ఈ సమ్మెలో వివిధ కారణాలతో 38 మంది ఆర్టీసీ కార్మికులు అమరులైనారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆశయ సాధన కోసం తాము నిరంతరం పోరాడుతామన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు, ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీల అమలు కోసం ముఖ్యమంత్రిని కలిసి వివరిస్తామన్నారు. పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.


అమరులైన కార్మికులకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

108 వాహనంలో మూడు కాన్పులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఉన్న 108 అంబులెన్స్‌లో శుక్రవారం రాత్రి అత్యవసరంగా మూడు సాధారణ కాన్పులు జరిగాయి. మూడు కాన్పుల్లో ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడబిడ్డ జన్మించగా తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆమనగల్లుకు చెందిన ప్రేమలత శుక్రవారం రాత్రి పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ప్రేమలతను కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్తుండగా మేడిగడ్డతండా వద్ద నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ఈఎంటీ రమేశ్, పైలెట్ చంద్రశేఖర్ సహకారంతో ప్రేమలత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ప్రేమలత, నవజాత శిశువును కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లికి చెందిన దివ్య పురిటినొప్పులతో బాధపడుతుందనే సమాచారం అందించడంతో 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా కందుకూరు సమీపంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను కందుకూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కడ్తాల మండలం గానుగుమర్ల తండాకు చెందిన అఖిల పురిటినొప్పులతో బాధపడుతుందని 108 అంబులెన్స్‌కు సమాచారం అందింది. దీంతో ఆమెను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం అఖిలను, చిన్నారిని నగరంలోని కోఠి మెటర్నిటీ ఆస్పత్రిలో చేర్పించారు. ఒకేరోజు రాత్రి ముగ్గురికి సాధారణ కాన్పులు చేసి తల్లీబిడ్డలను క్షేమంగా ఆస్పత్రికి చేర్చిన అంబులెన్స్ ఈఎంటీ రమేశ్, పైలట్ చంద్రశేఖర్‌లను పలువురు అభినందించారు.



ప్రభుత్వ భూములను రక్షించండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

శంకర్‌పల్లి: కొండకల్, కొండకల్ తండాల్లోని ప్రభుత్వ భూములను కొంతమంది అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ కొంతకాలంగా తండా వాసులు ఆందోళన చేపడుతున్నారు. ఇటీవల తండావాసులు ఢిల్లీలో ఎస్టీ కమిషన్ జాతీ సభ్యుడు జాటోతు హుస్సేన్‌ను కలిసి సమస్యను వివరించారు. శనివారం ఆయన కొండకల్ తండాలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి బహిరంగ చర్చకు రావాల్సి ఉండగా.. అనివార్య కారణాలతో ఆయన పర్యటన వాయిదా పడింది. అయినప్పటికీ తాండవాసులు ఇతర నాయకులు, సంఘాలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ, గిరిజనుల భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. కబ్జాకు గురైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ లేని భూమికి నంబర్ సృష్టించి, రిజిస్ట్రేషన్లు చేసుకుంటుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వల్లభ స్వామి కుంటని అందరూ కలిసి పరిశీలించారు.


ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి, నాయకులు